# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్‌తోని అయ్యేది లేదు.. పొయ్యేది లేదు

- వాళ్లను నమ్మితే ఆగమే..
- రైతులు సంబురంగా ఉంటే చూడలేకపోతున్నరు
- ఓటేస్తే నట్టేట మునిగినట్లే
- ఆ పార్టీ నాయకులపై అన్నదాతల ఆగ్రహం

'ధరణి పోర్టల్ మంచిగానే ఉంది కదా. పట్టాదారు లేకుండా ఒకరి భూమిని మరొకరికి పట్టా చేసే అవకాశం లేదు. ఎవరి భూమి వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. రెవెన్యూ ఆఫీస్‌కు పోవాల్సిన అవసరం లేదు. అమ్ముకున్నా, కొనుగోలు చేసిన నిమిషాల్లో పట్టా మార్పిడి అవుతున్నది. ధరణి రాక ముందు వీఆర్వోలు, ఎమ్మార్వోల చుట్టూ తిరిగేది. రిజిస్ట్రేషన్ చేయించుకున్నంక నెలలు, ఏండ్లు గడిచినా పట్టా మార్పిడి కాకపోయేది. లంచాలు ఇచ్చినోళ్లకే పట్టా కాగితాలు వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏ అధికారిని బతిలాడ్సిన పని లేదు. నేరుగా మీ సేవకు పోయి స్లాట్ బుక్ చేసుకొని, తహసీల్ కార్యాలయానికి పోతే రిజిస్రేషన్ అయితుంది. నిమిషాల్లో పట్టా మార్పిడి అయి పేపర్లు చేతికి వస్తున్నయ్. రైతులు సంబురంగా ఉంటే కాంగ్రెస్ నాయకులు, రేవంత్‌రెడ్డి ఓర్వలేకపోతున్నరు. కాంగ్రెస్‌తోని అయ్యేది లేదు.. పొయ్యేది లేదు. లేనిపోనివి చెప్తూ రైతులను ఆగం చేస్తున్నరు..' అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు.



## గతంలో పొలం కాడనే ఉండేది..

నిర్మల్ టౌన్, నవంబర్ 26 : పొలానికి ఎప్పుడు పోయినా మోటరు వేస్తే నీరు పారుతుంది. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పగలు,రాత్రి షిఫ్టుల వారీగా కరెంటు ఇవ్వడం వల్ల రైతు పొలం కాడానే ఉండాల్సి వచ్చేది. కరెంటు ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. వచ్చినప్పుడు పారుకం లేకుంటే పంట ఎండుడే. గిప్పుడు గ పరిస్థితి లేదు. కరెంటు పోతదన్న భయం కూడా లేదు. కాంగ్రెసోళ్లు కరెంటుపై ఆగం చేసేలా ఏదేదో మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలని పదేపదే చెప్పడం రైతులను మోసం చేసేందుకే. రైతులు బాగుపడడం ఆయనకు ఇష్టం లేకపోవడం వల్లే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.

**- గణేశ్, రైతు, ఓలా**



## కాంగ్రెసోళ్లు రైతుల బతుకును ఆగం చేసే మాటలు..

నిర్మల్ టౌన్, నవంబర్ 26 : బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరి 24 గంటల కరెంటు ఇవ్వడం వల్లే రైతుల బతుకులు బాగుపడ్డయ్. అందుకే రైతులు కేసీఆర్ వెంట నడుస్తున్నారన్న ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు అబద్ధపు మాటలతో మూడు గంటల కరెంటు పేరుతో రైతులను ఆగం చేస్తున్నారు. మా బతుకులను ఆగం జేసేటట్టు మాట్లాడుతున్నరు. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఉండేది కాదు. వాళ్ల పాలనలో ఎట్లా ఇబ్బందులు పడ్డమో ఇప్పటికీ యాదున్నది. మళ్లా ఆ పరిస్థితి రావద్దని కోరుకుంటున్న. అదే సీఎం కేసీఆర్ సారు వల్ల ఇప్పుడు రైతుకు కరెంటుపై పూర్తి నమ్మకం ఉండడం వల్ల ఎంత పంటైనా దర్జాగా పండించుకుంటున్నారు. రైతులు కాంగ్రెస్ మాటలను పట్టించుకునే అవసరం లేదు.

**- ముత్యం, రైతు ఓలా**

## భూ పంచాయితీలు పెరుగుతయ్..



నిర్మల్ టౌన్, నవంబర్ 26 : ధరణి రాకముందు గ్రామంలో భూ పంచాయితీలు ఎక్కువగా ఉంటుండే. భూమికి సంబంధించిన రికార్డులు కాగితాలపై రికార్డుల్లో రాయడం వల్ల రెవెన్యూ అధికారులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరించేవారు. రికార్డులు తప్పుగా రాసి వాటిని సరిదిద్దే పేరుతో డబ్బులు తీసుకెళ్లేవారు. ధరణి వచ్చాక భూ రికార్డులు ఒక్కసారి ఆన్‌లైన్ చేయడం వల్ల అవి మార్పిడికి అవకాశం లేదు. గతంలో బినామీ పేర్లతో భూములు మార్చేసేవారు. ఇప్పుడు భూరికార్డులు మార్చాలంటే భూ యాజమాని సంతకం పెడితే తప్పా ధరణి ద్వారా భూమార్పిడి జరుగడం లేదు.

**- రమణాగౌడ్, మంజులాపూర్**

## కేసీఆర్ అంటేనే నమ్మకం..



సోన్, నవంబర్ 26 : కేసీఆర్ అంటేనే రైతులకు నమ్మకం. అధికారంలోకి వస్తే 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పిన కేసీఆర్ పదేళ్ల నుంచి 24 గంటల కరెంటు ఇస్తున్నారు. గతంలో కరెంటు పోతుండే, వస్తుండే. కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలిసేది కాదు. ఇప్పుడు రైతు పొలంకాడికి పోయి మోటరు స్టాట్ చేస్తే పంటకు నీళ్లు మళ్లించే భరోసా ఉంది. కానీ, ఈ కాంగ్రెసోళ్లు మళ్లా వచ్చి 3 గంటల కరెంటు సరిపోతది. అందుకు 10 హెచ్‌పీ మోటర్ వాడాలె అంటున్రు. అదే జరిగేతే పొలంకాడానే కరెంటు కోసం కాపలా కాసే రోజులు వస్తయ్. రైతుల బతుకులు ఆగమైతయ్.

**- వెంకన్న, లంగ్డాపూర్**



## కార్యాలయాల చుట్టూ తిరుగుడైతది..

సోన్, నవంబర్ 26 : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ధరణి తెచ్చినప్పుడు మా కేమీ అర్థం కాలేదు. ధరణితో ఇబ్బందులుంటాయని భావించాం. ధరణి వచ్చాక భూ రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే రెవెన్యూ శాఖ కార్యాలయంలో ఉండడం వల్ల దరఖాస్తు చేసుకంటే పది నిమిషాల్లోనే డిజిటల్ రూపంలో ధ్రువపత్రాలు వస్తున్నయ్. గతంలో భూ రికార్డులు పొందాలంటే రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఎన్నో తిప్పలు పడేవాళ్లం. మూడు, నాలుగురోజులైనా రికార్డుల పత్రాలు రాక సమయం కూడా వృథా అయ్యేది. ఇప్పుడు ధరణి వల్ల ఇబ్బందుల్లేవు. కానీ కాంగ్రెసోళ్లు మళ్లా ధరణి తీసేత్తమంటున్రు. అదే జరిగే పాతరోజులే వస్తయ్. మళ్లా అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది.

**- ఆకుల ముత్తన్న, రైతు**



## రైతులు ఆలోచిస్తున్నారు...

సోన్, నవంబర్ 26 : రైతు సంక్షేమానికి ఏ ప్రభుత్వం కృషి చేసిందో రైతులు ఆలోచిస్తున్నారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్ సర్కారు రైతు పక్షపాతిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. 24 గంటల కరెంటుతో పాటు పంట పెట్టుబడి సాయం, బీమా వంటి సౌకర్యాలు కల్పించడంతో రైతులను తప్పుదోవ పట్టించేందుకు ధరణిపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారు. ధరణి స్థానంలో కొత్తగా ఏదో తెస్తారని చెప్తున్నరు. కాంగ్రెస్ హయాంలో తేనిది ఇప్పుడు తెస్తామంటే మేము నమ్ముతామా. ఇప్పుడు ఈ ధరణి బాగానే ఉంది కదా. రైతులు బాగా ఆలోచిస్తున్నారు. వారి మాటలను నమ్మే పరిస్థితి లేదు. మళ్లా పాత రోజులు తీసుకస్తమంటే ఊరుకునేదిలేదు.

**- దాసరి రాజేశ్వర్, రైతు, సోన్**



## పొలాలన్నీ బీడువారుతయ్..

దిలావర్‌పూర్, నవంబర్ 26 : కాంగ్రెస్ పార్టీ చెప్పే మూడు గంటల కరెంట్ అంటే ఇప్పుడున్న పంట చేనులు బీడు భూములైతయ్. ఎవుసం మానుకోవాల్సిందే. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇయ్యడంతో పనికిరాని భూములను కూడా చదును చేసుకొని సాగు చేసి నాలుగు రూపాలు సంపాధించుకుటున్నం. మా పోరగాండ్లను మంచిగ సదివిపించుకుంటున్నం. గిప్పుడుగా ఢిల్లీ కాంగ్రెస్ గద్దల కండ్లు మా తెలంగాణ మీద పడ్డయ్. మీరు పాలిస్తున్న రాష్ట్రంలో రైతుల పరిస్థితిని మాకు తీసుకొద్దామనుకుంటున్నరా. పిట్టల దొర రేవంత్ రెడ్డి.. పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడి రైతులను ఆందోళనలకు గురిచెయ్యకు. మాకు మీ పార్టీ వద్దు మీరు వద్దు. మాకు కారు పార్టీ కావాలి.

**- వినోద్, రైతు, సాంగ్వి**



## దర్జాగా పని అయిపోతున్నది..

నిర్మల్ టౌన్, నవంబర్ 26 : ధరణి వచ్చాక దళారులు లేకుండా దర్జాగా పని అయితున్నది. ధరణిలో ఓ రైతుకు సంబంధించిన సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, అన్ని వివరాలు ఉండడం వల్ల పహానీ, 1బీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న పది నిమిషాల్లోనే రైతు చేతికొస్తున్నాయి. గతంలో సర్టిఫికెట్ పొందాలంటే అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. పలుకుబడి ఉన్న వ్యక్తులతో వెళ్తేనే పని అయ్యేది కాదు. ఇప్పుడు చదువులేని రైతు కూడా స్వయంగా వెళ్లి ధరణిలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఈజీగా పని అయిపోతుంది. గిప్పుడు గా కాంగ్రేసోళ్లు వచ్చి మళ్లా ధరణి తీసేస్తమంటున్నరు. గదే జరిగితే మళ్లా పాతరోజులే వస్తయ్.

**- నాలం శివ్వయ్య, రైతు**